RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | బుధవారం 4 డిసెంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 205 | పేజీలు: 4 | వెల: రూ.5/-

## హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

### రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, పార్కుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా కు తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. మంగళవారం, హైడ్రా కార్యాలయ నిర్వహణకు, వాహనాల కొనుగోలుకు రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఆవిర్భావం తరువాత జీహెచ్ఎంసీ(ఉఊఓఅ) పరిధిలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణల నుండి విముక్తి పొందాయి. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నగరంలోని పర్యావరణాన్ని కాపాడేందుకు ..మిగతా 2లో

# హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మారుస్తాం

- హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా
- ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు
- నిధులు తెస్తరా? గుజరాత్‌కు వలసపోతారా?
- కిషన్ రెడ్డిని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ ప్రక్షాళనతో నిర్వాసితులకు అండగా ఉన్నాం
- నిద్రలు చేయడం మాని నిధులు తీసుకురండి
- ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకురాలేదు
- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలి
- కేంద్రం నుండి రూ. 10 వేల కోట్లు తీసుకురండి
- పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్
- అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్‌దే
- రైజింగ్ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో రైజింగ్ ఉత్సవాల నిర్వహణ




హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద గల హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైజింగ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా మూసీ సుందరీ కరణ పేరుతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి విషయంలో తాము వెనుకడుగు వేయబోమన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరం ఎందరో యువకులకు ఉపాధినిస్తుందని, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఎందరో నాయకులు, ఐటీ కంపెనీలను హైదరాబాద్ కు తీసుకువచ్చి నగరం అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. పిజెఆర్ వల్లే గోదావరి జలాలు నగరానికి వచ్చాయని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలకు పోటీనిచ్చే సత్తా ఉన్న నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, ప్రభుత్వానికి 65 శాతం ఆదాయం ఇక్కడి నుండే వస్తుందన్నారు. తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సాగిస్తున్నామని, 7 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో గల సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కేంద్రంతో మాట్లాడి ఒక్క రూ.10 వేల కోట్లు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట తాము ..మిగతా 2లో



## పంచాయతీరాజ్ చట్టసవరణపై ప్రభుత్వం కసరత్తు

### రిజర్వేషన్ల కాలపరిమితిలో మార్పుకు సన్నద్ధం

### కలెక్టర్, ఉప సర్పంచ్ అధికారాలకు కోతవిధించే అవకాశం

### త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగరా

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగరా మోగనుంది. అయితే అది బీసీ కులగణన తర్వాతే. అందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో 12,992 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్ కాల పరిమితి ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ ఇవ్వడంతో అందుకు తగ్గట్టుగా ఇప్పుడు బీసీ కుల గణన జరుగుతోంది. ఈ సర్వే తర్వాత బీసీ జనాభా దామాష పద్ధతిన పంచాయతీలు బీసీలకు రిజర్వే చేయనున్నారు. అయితే ఇందు కోసం పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులు చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా వచ్చే శాసనసభ సమావేశాల్లో పంచాయతీ రాజ్ బిల్లులో సవరణలు చేయనున్నారు. కేవలం బీసీ రిజర్వేషన్ల కోసమే కాకుండా మరి కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని పంచాయతీ రాజ శాఖ అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ హాయంలో అంటే 2018లో పంచాయతీ రాజ్ బిల్లు తీసుకువచ్చింది. అందులో పదేళ్ల కోమారు అంటే రెండు టర్మ్‌ల తర్వాతే రిజర్వేషన్ల మార్పుపై నిర్ణయం తీసుకునేలా చట్టంలో పేర్కొంది. అంతకు మునుపు ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్లు మార్పు ఉండేది. కాని కేసీఆర్ హాయంలో దాన్ని పదేళ్లకు చేసింది. ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్ల మార్పు వల్ల ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని, అభివృద్ధి కుంటుపడుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ సర్కార్ దీన్ని ఐదేళ్లకు కుదించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు బిల్లులో మార్పులు తెచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుత పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు ఉంది. అయితే సర్పంచ్‌లు ప్రజల చేత ఎన్నుకోబడిన వారు. వారిని తొలగించే అధికారం ..మిగతా 2లో

# గెలిస్తే ఆరు గ్యారంటీలు అన్న కాంగ్రెస్!

## గెలిచిన తర్వాత 6 చెరువుల నీరు!

## అలీబాబా 40 దొంగల్లాగా ఆ ముగ్గురు ఆర్థిక దొంగ గాళ్లే!!

### ఐలాపూర్ పేదల ఉసురు తగలక మానదు- బైక్ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



బైక్ ర్యాలీలో భారీగా పాల్గొన్న బిజెపి కమలనాధులు

- అక్రమ నిర్మాణాలంటూ హైడ్రాతో ఆడుతున్న నాటకం
- గూడెం మహిపాల్ రెడ్డి, నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్‌లు ముగ్గురూ తోడు దొంగలే!
- పఠాన్ చెరువు అక్రమ మైనింగ్‌లకు కేరాఫ్ ఈ ముగ్గురే
- బయటకు శత్రువుల లాగా!!! లోన దోచుకున్న మూటలను పంచుకునే ఆర్థిక నేరగాళ్ల గుంపు దోస్తులు!
- బీజేపీ వస్తుంది! భరతం పడుతుంది!
- అధికారంలోకి వస్తే మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ అన్నారు!
- ఉన్న స్కూళ్లకు దిక్కు మొక్కు లేదు!!
- అక్రమ ఆస్తులు కాపాడుకోవడంలో ఎమ్మెల్యే గూడెం బిజీగా మహిపాల్ రెడ్డి
- నీలం మధు చిట్టా విప్పుతాం, గణేష్ గడ్డ భూ, అక్రమ దందా, మైనింగ్ లావాదేవీలపై ఫోకస్ పెడతాం!!



కాంగ్రెస్ 6 గ్యారెంటీలను ఎండగడుతూ బైక్ ర్యాలీలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే, 6 గ్యారంటీలను అమలు చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన తరువాత 6 గ్యారెంటీ అమలు ఏమోగానీ, ప్రజలకు 6 చెరువుల నీళ్లు తాపుతున్నారని సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల వాగ్దానం లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన 6 గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని పఠాన్ చెరువు నియోజకవర్గం లో బస్తి బస్తీ, కాలనీల లో కలియ తిరుగుతూ నిర్వహించిన బైక్ ర్యాలీలో గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ అన్నారు. అమీన్ పూర్ మండల ఐలాపూర్ గ్రామంలో నిరుపేదల ఇళ్లను బుల్డోజర్ల తో నేలమట్టం చేయించి, అట్టి భూమిని ఆక్రమించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని మాట్లాడడానికి చెప్పలేని నానా బూతులు తిట్టిన కాటా శ్రీనివాస్ గౌడ్ ఇప్పుడు ఏమి సమాధానం చెప్తాడని తీవ్ర స్వరంతో అన్నారు. చేసిన అక్రమాలు బయట పడతాయని, అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకోవాలన, ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

మొదటి పేజీ తరువాయి...

ఈ సంస్థ నిరంతర శ్రమ చేస్తోంది. హైడ్రాకు మరింత శక్తివంతమైన అధికారాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా హైడ్రా అనేక విస్తృత అధికారాలను పొందుతూ, చెరువుల రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధునాతన సాంకేతిక పద్ధతులు, వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఈ నిధులు హైడ్రా పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయి. ఈ చొరవతో చెరువుల సంరక్షణ, పర్యావరణ రక్షణలో హైదరాబాద్ నగరం దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో హైడ్రా కొరడా ఝుళిపించింది. అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో పార్కు స్థలాన్ని ఆక్రమించి, ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేసిన ఘటనపై హైడ్రా, పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాలనీ వాసులు ఈ సమస్యను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి నివేదించారు. గతంలో ఈ ఘటనపై కమిషనర్, హైడ్రా, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వెంటనే చర్యలు తీసుకోవడం లేదని వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న లక్ష్మారెడ్డి, హైడ్రా, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున హైడ్రా, మీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టి, పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను ధ్వంసం చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటపరికరాలను తిరిగి ఏర్పాటు చేశారు.

# గెలిస్తే ఆరు గ్యారంటీలు అన్న కాంగ్రెస్!

మొదటి పేజీ తరువాయి...

గెలిపించిన బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరడం తోనే మహిపాల్ రెడ్డి నిజ స్వరూపం తేట తెల్లమైందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ లోనే కాటా శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ని బుజ్జగిస్తున్నారని అన్నారు. నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి లు జత కట్టి పటాన్చెరును అడ్డంగా దోచుకోండని సీఎం రేవంత్ రెడ్డి దశ దిశ చేసినట్లుగా భావించాల్సి వస్తుంది అని అన్నారు. ప్రొద్దున బద్ద శత్రువుల లాగా రాత్రులు అక్రమ సంపాదన పార్టనర్స్‌గా వ్యవహరిస్తున్న తీరును నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తు ఎరగాలని అన్నారు. అతి తొందరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో, అలాగే గ్రేటర్ హైదరాబాద్ కార్పోరేట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే సమాధానం పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు సమాధానం ఇవ్వనున్నారని అన్నారు. మహిపాల్ రెడ్డి ని తిట్టిన తిట్టు తిట్టకుండా మౌనవ్రతం వహించిన కాటా శ్రీనివాస్ గౌడ్ ఏమి సమాధానం చెప్తాడని ఎదురు ప్రశ్న వేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో నీలం మధును కాటా సుధారాణి చెప్పుతో కొడతాను బిడ్డ అన్న మాటలు మర్చిపోయి, ముగ్గురు తోడు దొంగలను వెనకేసుకొస్తున్న కాటా సుధానిని ఏమనాలని అన్నారు. చట్టా పట్టాలు వేసుకుంటూ పటాన్ చెరువు నియోజకవర్గంలోని అక్రమ మైనింగ్లో, అక్రమ భూ దంధాలు చేస్తూ సంపాదించిన సొమ్మును తోడు దొంగల్లాగా పంచుకుంటూ బయటకి శత్రులలాగా లోన ఆలీబాబా 40 దొంగలు లాగ ముగ్గురు తోడు దొంగలై పఠాన్ చెరువు నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతాలలోని పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇస్తామని అన్న కాంగ్రెస్ పార్టీ, గెలిచిన తర్వాత హైడ్రా అనే బూచును చూపిస్తూ అక్రమ కట్టడాలంటూ బీదల ఇళ్లను నేల మట్టం చేస్తున్నారని



సీఎం రేవంత్ రెడ్డి 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రసంగిస్తున్న సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, శ్రీనివాస్ గుప్త, అదేళ్ల రవీందర్ తదితరులు

అన్నారు. చెరువులు కుంటలు, నాలాలలో అక్రమ నిర్మాణాలంటూ హైడ్రా ముసుగులో గరీబుల ఇళ్లను కూల గొడుతూ అట్టి స్థలాలపై కన్నేసి దొడ్డి దారిన భూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వచ్చిన వేలకోట్లను ఈ ముగ్గురు ముఠా దొంగలు వాటాలు వేసుకుంటూ పంచుకుంటున్నారు అని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారం లోకి రానున్నదని వచ్చే ఏ ఎన్నికల అయినను ఎదుర్కోవడానికి కమలనాథులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో అందరి చిట్టాలు బయటపెడతామని అన్నారు. మంగళవారం పటాన్ చెరువు బసవేశ్వరుని విగ్రహం సాక్షిగా మొదలైన ర్యాలీ పట్టణంలోని పుర వీధులలో ర్యాలీగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇస్తూ, జైశ్రీరామ్ అంటూ, పట్టణ ప్రజలను ఆకర్షిస్తూ బిజెపి మహిళా మణులు కాషాయ జెండాలను ఎగురవేస్తూ పెద్ద ఎత్తున బైకులు నడిపిస్తూ ముందు వరసలో ఉండడం పట్టణ ప్రజలను బాగా ఆకర్షించింది. పటాన్ చెరువులో ప్రారంభమైన బైక్ ర్యాలీ రామచంద్రపురం మీదుగా, బీరంగూడ, అమీన్పూర్, ముత్తంగి, ఇస్నాపూర్, వందనాపూర్, మల్లికార్జున నగర్, రామచంద్రారెడ్డి తదితర కాలనీలలో ప్రయాణిస్తూ, ప్రజలను ఆకట్టుకున్న బైక్ ర్యాలీగా చెప్పక తప్పదు. ఈ మధ్య కాలంలో భారతీయ జనతా పార్టీ పటాన్చెరు నియోజకవర్గంలో ప్రత్యేక దృష్టి పెట్టిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ బైకు ర్యాలీలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదేళ్ల రవీందర్, ఎడ్ల రమేష్, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ బిజెపి నాయకులు నర్సింగరావు, బిల్లా రవి, రాజేందర్ రెడ్డి, పటాన్చెరువు బిజెపి నియోజక ఇంచార్జ్ శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మారుస్తాం

మొదటి పేజీ తరువాయి...

నిర్వాసితులకు అండగా నిలబడుతుంటే, అక్కడికి వెళ్లి నిద్రలు చేయడం మాని కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన భాధ్యత కిషన్ రెడ్డిపై ఉందన్నారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలని, నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా? మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి ఎంత నిధులు తీసుకొస్తవ్ అంటూ సీఎం ప్రశ్నించారు. పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కి పరిమితమై, తాము చేసే అభివృద్ధికి అడ్డు పెట్టడం ఎలా అంటూ ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ట్యాంక్ బండ్ నీరు పాలమాదిరిగా మారుస్తామని హామీలిచ్చి, పదేళ్లు అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీఆర్ ఎస్ , బీజేపీలపై చర్చించేందుకు తాను సిద్ధమని, మీ పాలసీ డాక్యుమెంట్ ను తెలంగాణ సమాజానికి చూపించండంటూ సీఎం సవాల్ విసిరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తాము కట్టుబడి, వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తామని, అఖిల పక్ష సమావేశం సైతం నిర్వహిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ఏమేమి సలహాలు ఇస్తారో ఇవ్వండి అంటూ సీఎం పిలుపునిచ్చారు. రాజధాని గుండా ప్రవహిస్తున్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకువచ్చి మురికి కూపంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. దాంతో పాటు హైదరాబాదు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చి పర్యాటకంగా, అందంగా అభివృద్ధి చేసి, మూసిని జీవ నదిగా మార్చాలని తమ ప్రభుత ముందుకుపోతందన్నారు. ఇది ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల పైగా ప్రవహిస్తున్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలిపి పునరుజ్జీవం తీసుకువస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి విద్య ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించలేమన్న భయంతో కుట్రపూరితంగా బిఆర్ఎస్ తన సోషల్ మీడియా ద్వారా ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం మీద ప్రేమ, పేదవాళ్లపై అభిమానం ఉంటే సహకరించాల్సింది పోయి కుట్రలు చేయడం మానుకోవాలని బిఆర్ఎస్ నాయకులకు సూచించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్లో హైదరాబాద్ మహానగర అభివృద్ధి కోసం పది వేల కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. హైదరాబాదులో ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనదారులకు సజావుగా ప్రయాణించేందుకు అండర్ పాస్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు నిర్మాణం చేసి రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 400 మురికివాడల్లో నివాసం ఉంటున్న మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చడానికి మెప్మా ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని చెప్పారు. ఢిల్లీ లాంటి ముప్పు హైదరాబాదు నగరానికి రావొద్దన్న ముందు చూపుతో కాలుష్యం లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. హైదరాబాదు నగరం రాష్ట్రానికే తలమానికం కాదని దేశం గర్వించే విధంగా అభివృద్ధి చేయబోతున్న నగరంగా మారబోతున్నదని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా మార్చాలన్న సంకల్పంతో పస రేవంత్ రెడ్డితో సహా మంత్రిమండలి సభ్యులందరం చర్చించి హైదరాబాదుకు కావలసిన అన్ని హంగులను తీసుకురావడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని వెల్లడించారు. 10 సంవత్సరాలు పరిపాలన చేసిన టిఆర్ఎస్ పాలకులు హైదరాబాద్ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధికి రంగులు వేసుకుని పదేళ్లు కాలం వెళ్లదీశారని ఆరోపించారు. పదేళ్లు పాలించి పది పైసలు కూడా నగరం కోసం ఖర్చు చేయని బిఆర్ఎస్ పాలకులకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు.

# బీఆర్ఎస్ గురుకుల బాటలో తీవ్ర ఉద్రిక్తత

## ఏనుగుల రాకేష్‌రెడ్డి సహా 50మంది అరెస్టు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమం వరంగల్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి, ఆయన అనుచరులు దాదాపు 50 మంది హనుమకొండ జిల్లా పరిధి మడికొండలోని గురుకులానికి వెళ్లారు. హాస్టల్ లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదంటూ స్థానిక పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మడికొండ సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో గులాబీ పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఇరువర్గాల మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం నడించింది. అప్పటికే పోలీసులు బలగాలు అక్కడ మోహరించడం, బీఆర్ఎస్ నేతలకు, వారికి మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితి చేయి దాటే అవకాశం ఉంటడంతో రాకేష్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 50 మంది కార్యకర్తలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దాదాపు గంట పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా.. అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాలు బాగయ్యేంత వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంబడిస్తూనే ఉంటామని.. బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. మడికొండ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అరకొర వసతులతో నిర్వహిస్తున్న గురుకులాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు 'గురుకుల బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన తమను పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తామేమీ సంఘ విద్రోహ శక్తులం కాదన్నారు. అరకొర వసతులతో అవస్థలు పడుతున్న విద్యార్థులకు సహాయం చేయడానికే వచ్చామని, అంతే తప్ప రాజకీయాలు చేయడానికి రాలేదని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కూడా పాఠశాలల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఎన్నడూ ఇంత నిర్బంధం చూడలేదన్నారు.దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గడిచిన పది నెలల కాలంలోనే మొత్తంగా 49 మంది విద్యార్థులు మరణించారని.. రాకేష్ రెడ్డి ఆరోపించారు. సుమారు 1500 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారన్నారు. గురుకుల పాఠశాల పిల్లలు హాస్టల్‌లో కంటే హాస్పిటల్‌లోనే ఎక్కువగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో అంతా బాగానే ఉంటే బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. అసలు లోపలికి అనుమతి ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పంచాయతీరాజ్ చట్టసవరణపై ప్రభుత్వం కసరత్తు

మొదటి పేజీ తరువాయి...

కలెక్టర్లకు కట్టబెట్టడంపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సర్పంచ్‌లు దీన్ని వ్యతిరేకించారు. ప్రజా ప్రతినిధులు ఈ అధికారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు రేవంత్ సర్కార్ సానుకూలంగా స్పందించింది. వచ్చే బిల్లులో ఈ మేరకు కలెక్టర్ అధికారాలకు కోత పడనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ కట్టబెట్టింది. దీంతో పంచాయతీలో సర్పంచ్ ఏ పని చేయాలన్నా ఉప సర్పంచి సంతకం పెడితేనే నిధులు విడుదల అయ్యే పరిస్థితి. దీంతో చాలా పంచాయతీల్లో సర్పంచ్ ఓ పార్టీ వ్యక్తి అయితే, ఉప సర్పంచ్ మరో పార్టీ వ్యక్తి ఎన్నికవడం జరిగింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ఆ పంచాయతీ అభివృద్ధి కుంటుపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే అప్పటి ప్రభుత్వం ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఇవ్వడం ద్వారా సర్పంచ్ అవినీతికి పాల్పడకుండా ఉంటారన్న ఉద్దేశాన్ని వెలిబుచ్చింది. అయితే దీనిపై సర్పంచ్లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. సర్పంచ్‌తో సమానంగా ఉప సర్పంచ్‌కు చెక్ పవర్ ఇస్తే తమ పదవికి విలువ ఏంటని పార్టీ వేదికలపైన ప్రశ్నించిన సందర్భాలున్నాయి. వచ్చే బిల్లులో ఉప సర్పంచ్లకు చెక్ పవర్ రద్దు చేసే దిశగా పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులున్నాయి. ఉప సర్పంచ్‌కు బదులు పంచాయతీ కార్యదర్శికి ఆ అధికారం ఇచ్చే అవకాశం ఉంది.పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలి. ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే వారు పోటీకి అనర్హులు. అయితే మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపాలిటీల్లో కార్పోరేటర్లకు, మున్సిపల్ ఛైర్మన్లకు ఇలాంటి నిబంధన లేదు. అదే రీతిలో కార్పోరేషన్లలో కార్పోరేటర్లకు, మేయర్ ఎన్నికకు ఈ నిబంధన లేదు. కేవలం పంచాయతీ రాజ్ చట్టంలోనే పేర్కొనడంపై విమర్శలు వచ్చాయి. దీన్ని మార్చాలన్న డిమాండ్ ఉంది. ఈ దఫా అసెంబ్లీసమావేశాల్లో ఈ దిశగా మార్పు ఉండే అవకాశం ఉంది. సర్పంచ్‌లకు ముగ్గురు పిల్లలు ఉంటే పోటీ చేయరాదన్న నిబంధన తొలగించి పోటీకి వెసులుబాటు కల్పించవచ్చు.ప్రతీ మండలంలో జనాభాను బట్టి ఎంపీటీసీ స్థానాలు ఉంటాయి. ప్రతీ ఐదు వేలమందికి ఓ ఎంపీటీసీ ఉండే అవకాశం ఉంది. అయితే మారిన జనాభా నిష్పత్తిని బట్టి ఎంపీటీసీల సంఖ్య పెరగలేదు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న మండలాలు ఉన్నాయి. ఐదు కన్నా తక్కువ మంది ఎంపీటీసీలున్న మండలాలు ఉన్నాయి. అత్యధికంగా ముత్యంపేట (22 ఎంపీటీసీలు), పెద్దపల్లి (21 ఎంపీటీసీలు) నాగర్ కర్నూల్ (20 ఎంపీటీసీలు), భద్రాచలం (20 ఎంపీటీసీలు) ఉన్నారు. అతి తక్కువగా నాగంగాపురం (4 ఎంపీటీసీలు) వంగర (4 ఎంపీటీసీలు), పస్రి (5 ఎంపీటీసీలు), తాడేపల్లి (5 ఎంపీటీసీలు),అదిలాబాద్ (5 ఎంపీటీసీలు) పాద్మానగర్ (5 ఎంపీటీసీలు) ఉన్నారు. అయితే ప్రతీ మండలానికి కనీసం ఐదుగురు ఎంపీటీసీలు ఉండేలా పంచాయత్ రాజ్ చట్టంలో మార్పులు తీసుకురానున్నారు.

# నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది

## కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రాష్ట్రంలో నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది అయ్యింది. ప్రజా పాలన ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరించిన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ గడీల పాలన, ఫామ్ హౌస్ పాలనతో విసిగిపోయింది తెలంగాణ. అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటైంది. సంపూర్ణ మెజారిటీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.ఏడాది పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మిగతా మంత్రుల సమిష్టి నిర్ణయాలతో తొలి ఏడాది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వెలిగిపోతోందన్నారు. ప్రస్తుతం రైజింగ్ తెలంగాణగా ఉందన్న విషయం ప్రజలకు అందరికి తెలుసన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు టీపీసీసీ. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయం, ఆరోగ్య శ్రీ 10 లక్షల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ కోసం 21 వేల కోట్ల రూపాయల కేటాయించిందన్నారు. దీని ద్వారా 23 లక్షల మందికి లబ్ది జరిగిందన్ని విషయాన్ని వక్కానించారు మహేష్‌కుమార్. ధాన్యం 500 రూపాయల బోనస్‌తో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఒక్క ఏడాదిలో సుమారు 54 వేల 500 ఉద్యోగాలు ఇచ్చి యువతను అదుకుందని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. డ్రగ్స్ నివారణకు కృషి జరుగుతోందని వివరించారు.ఇక మూసీ నది పునర్జీవనం ఒక అద్భుతమైన పథకంగా వర్ణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఓ వైపు పథకాలు.. మరోవైపు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఏడాదిలో అన్ని రకాలుగా సహకరించిన ప్రజలకు తన వంతు ధన్యవాదాలు తెలిపారు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్.

# ఎన్‌కౌంటర్ పరిణామాలు, పంచనామాపై సమగ్ర రిపోర్ట్ ఇవ్వండి

## తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం

## ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సల్స్ మరణించిన విషయం తెలిసిందే. అయితే తన భర్త మల్లయ్య మృతదేహానికి పంచనామా సరిగా జరగలేదని, డెడ్‌బాడీపై కాలిన గాయాలు ఉన్నాయంటూ కే.ఐలమ్మ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. పిటిషనర్, ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మల్లయ్య మృతదేహాన్ని భద్రపరచాలని పోలీసులను ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పరిణామాలు, పంచనామాపై సమగ్ర నివేదిక సమర్పించాలన్న న్యాయస్థానం ఆదేశించింది. మిగతా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే మావోయిస్టుల మృతదేహాలను భద్రపరిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. మృతదేహాలకు నిబంధనల ప్రకారమే పోస్టుమార్టం నిర్వహించామన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టు ఆదేశాల అనుసారమే పంచనామా ప్రక్రియ పూర్తి చేశామని, 8 మంది వైద్య నిపుణులతో ఈ ప్రక్రియ పూర్తి చేశామని హైకోర్టుకు గవర్నమెంట్ ప్లీడర్ తెలిపారు. దీంతో పోస్టుమార్గం సమద్ర నివేదికను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎంపీడీఓ

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** తెలంగాణ రాష్ట్రములో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కల్లూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఉన్న పోలింగ్ బూత్ లను ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ.ఓ సురేష్ బాబు, ఈవో నందిశెట్టి నాగేశ్వరరావుతరితరులు పాల్గొన్నారు.

# ప్రాణబిక్ష పెట్టండి...!

### ఆర్థిక సహాయం చేసి కుటుంబాన్ని ఆదుకోండి
### వేడుకుంటున్న కిడ్నీ బాధితులు మోలుగు మాటి సత్యం





**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలలో ఆర్థిక సంక్షోభం ఏర్పడితే వారి అవస్థలు వర్ణనాతీతం. కుటుంబ సభ్యుల భవిష్యత్తు భద్రత ఇంటి యజమానిపై ఆధారపడి ఉంటుంది.ఇంటి యజమాని అచేతన స్థితిలో ఉంటే ఆ కుటుంబ పరిస్థితి భగవంతుడికెరుక. అటువంటి దుర్భరమైన స్థితి మండలంలో చంద్రుపట్ల గ్రామపంచాయతీకి చెందిన మోలుగుమాటి సత్యం పరిస్థితి. కిడ్నీలు పాడై తన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారి మృత్యువుతో పోరాడుతున్నాడు. తన కళ్లేదుటే కుటుంబం ఆర్థిక స్థితిగతులతో అవస్థల పడుతున్న తానేమి చేయలేక దీనంగా ఎదురుచూస్తున్నాడు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలని లక్ష్యంతో కుటుంబ పోషణకు ఆటో నడుపుతూ జీవనం కొనసాగించానని తెలిపాడు. అకస్మాత్తుగా అనారోగ్య పాలవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి ప్రశ్నార్థకంగా మారి అవస్థ పడుతూ తన ఆరోగ్యాన్ని కాపాడుకోలేని తన ఆర్థిక స్థితి దాతల సహాయం కోసం ఎదురుచూసేలా చేసింది.షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో తన పరిస్థితే ఆగమ్య గోచరంగా ఉంటే కుటుంబమేమైపోతుందోనని ఆయుష్ను కూడగట్టుకొని జీవిస్తున్నట్లు తెలిపాడు.తన భార్య హైమావతి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుందని తెలిపారు.

ఎటుచూసినా ఆర్థిక సంక్షోభమే. ఆ కుటుంబానికి దాతల సహాయం అవసరం. అటువంటి దీనస్థితిలో మోలుగుమాటి సత్యం కుటుంబం.సత్యం కి భార్య హైమావతి ,ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రాజేష్ ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుమార్తెలకు వివాహం చేశాడు. కుమారుడు ఎం ఫార్మసీ చదువుతున్నాడని తెలిపారు.ఆయన చదువులకు,నా మందులకు డబ్బులు లేక అవస్థపడుతున్నామని తెలిపారు. కరోనా తో అనారోగ్యానికిపాలై సావు బ్రతుకల నుండి బయటపడి ఏడాది తిరగకముందే మరలా అస్వస్థకు గురైనప్పుడు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకోగా తక్షణమే ఖమ్మం వైద్యశాలకు వెళ్ళమని చెప్పడంతో అక్కడ వైద్యులు పరీక్షలు చేసి రెండు కిడ్నీలు పాడైపోయాయని డయాలసిస్ చేస్తేనే బ్రతుకుతాడని లేకపోతే కష్టమేనని తేల్చిచెప్పడంతో తన శాయశక్తుల వడ్డీలకు లక్షకు పైగా తెచ్చి వైద్యం చేయించుకున్నానని అన్నారు.తనకు తెలిసిన వారి సమాచారంతో తిరువూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ చేయించుకుంటున్నానని అన్నారు.కానీ రెండు రోజులకు ఒకసారి డయాలసిస్ చేయించుకోవడంతో వైద్యం కోసం నెలకి సుమారు 7000 రూపాయలు ఖర్చు అవుతున్నాయని అన్నారు.ఇంట్లో తింటానికి తిండితినే పరిస్థితే కష్టతరంగా ఉంటే, ఆటోలకు చార్జీలు లేక నరకం అనుభవిస్తున్నానని తెలిపారు. వైద్యం చేయించకపోతే ఏమైపోతానోనని భయభ్రాంతులకు గురై చేతకాని దీనస్థితిలో నా కుటుంబాన్ని ఆదుకోండంటూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాని కంట తడి పెట్టుకున్నాడు. ఇంతటి క్లిష్ట పరిస్థితిలో ఉన్న మోలుగుమాటి సత్యం కుటుంబాన్ని మానవత్వంతో ఆదుకోవాలని దాతలను ఆశ్రయిస్తున్నట్లు అన్నారు.సహాయం చేయాలనే సంకల్పం కలిగిన మానవతావాదులు ఎవరైనా ఉంటే ఆర్థిక సాయం అందించే వారు ఫోన్ నెంబర్ 8897517538 ని సంప్రదించగలరు.

## కిడ్నీ బాధితునికి ప్రెస్ క్లబ్ ఆర్థిక సహాయం

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** మండల పరిధిలో చంద్రుపట్ల గ్రామమునకు చెందిన మొలుగుమాటి సత్యం రెండు కిడ్నీలు పాడై అనారోగ్యముతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ ఆధ్వర్యంలో 5 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల గత ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని మంగళవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఖమ్మంపాటి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వారి నివాస గృహానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయబడుతుందని నెలకు మందులకు 5 వేలు ఖర్చవుతుందని తెలపడంతో తమవంతుగా ఒక నెలకు మందులకు సరిపడు ఖర్చులకు గాను ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి కావేటి రాధాకృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి నలగట్ల గురవయ్య,ఆర్గనైజింగ్ సెక్రెటరీ తాళ్ళూరి సుమన్, కొప్పుల గౌతం బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## టాటా ఏసి అతి వేగంగా టీవియస్ వాహనాన్ని డీకొట్టగా టీవియస్ పైన ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** 3.12.2024న ఉదయం 6 గంటల సమయంలో మండల పరిధిలో రామకృష్ణపురంలో గల హెరిటేజ్ సమీపంలో జొనబోయిన నాగ ముత్యం అనే టేకులపల్లి గ్రామం,పెనుబల్లి మండలం కు చెందిన వ్యక్తి తన యొక్క టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పై కల్లూరు నుండి తిరిగి ఇంటికి వస్తుండగా హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ దాటిన తర్వాత టాటా ఏసీ డ్రైవర్ అయినా కొంపల్లి రాకేష్ తండ్రి మల్లయ్య అను వ్యక్తి టాటా ఏసీ ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి తన భర్త వస్తున్న మోటార్ సైకిల్ ను వెనక నుండి గుద్దగా కలిగిన బలమైన గాయాలతో చనిపోయినాడు అని మృతుని భార్య రాజ్యలక్ష్మి పోలీస్ వారికీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు ఎస్సై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగినది.



## మట్టి నమూనాల సేకరణ

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** మండలంలోని కొండపురం గ్రామ రెవెన్యూ పరిధిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ సి 2024 సంవత్సరంలో భాగంగా మట్టి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, వ్యవసాయ విస్తరణ అధికారులు శిరీష, చంద్రశేఖర్, రైతులు శ్రీరామ్, సత్యనారాయణ, అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



## భీరాపల్లి గ్రామంలో 12.50 లక్షలతో సీసీ రోడ్లు శంకుస్థాపన

**వెంసూరు -ప్రభాత సూర్యుడు:** భీరాపల్లి గ్రామంలో 12.50 లక్షలు తో సీసీ రోడ్లు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం లో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీ పథకాల్లో 5 గ్యారంటీ పథకాలు అమలు. మహిళ మణులకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లు వరకు ఉచిత కరెంటు, 500 రూపాయలు కే గ్యాస్ బండ అందిస్తున్నన్నారు, రుణమాఫీ, సన్న రకం వరి ధాన్యం కు క్వింటాకు 500 రూపాయలు బోనస్ అందించినందుకు రైతు సోదరులు పండుగ చేసుకుంటున్నారు. త్వరలో ఇందిరమ్మ ఇల్లు కూడా ప్రారంభించటం జరుగుతుంది అని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి ని అందిస్తున్న ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరావు , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి. డిసెంబర్ 5 వ తారీకు బుగ్గపాడు ఫుడ్ పార్క్ లో జరగబోయే ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు భారీ బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతంచెయ్యాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ యం సి చైర్మన్ దోమ ఆనంద్, తహసీల్దార్, ఆర్. డబ్ల్యూ.యస్. డి. ఈ, స్పెషల్ ఆఫీసర్,సీడీపీఓ , ఎస్సై ,ఏ ఓ , ఏఈవో ,వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, జెల్ది జగన్ మోహన్ రావు ,అట్లూరి సత్యనారాయణ రెడ్డి,దొడ్డా శ్రీను, సుబ్బారెడ్డి, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,భీరాపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,భీరాపల్లి ఇందిరమ్మ కమిటీ,గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



## డిసెంబర్ 5న మెగా ఫుడ్ పార్క్ ప్రారంభం

**సత్తుపల్లి - ప్రభాత సూర్యుడు:** మండలం పరిధిలో బుగ్గపాడు లో గల మెగా ఫుడ్ పార్క్ ను డిసెంబర్ 5 వ తారీకు నా ప్రారంబానికి సిద్ధం గా ఉంది. ఈ మెగా ఫుడ్ పార్క్ ప్రారంభం అనంతరం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు సందర్భంగా భారీ బహిరంగ సభనిర్వహించనున్న కాంగ్రెస్ శ్రేణులు. సబా ప్రాంగణం ను మరియు సభ ఏర్పాట్లు ను పరిశీలించి నాయకులకు, ఫుడ్ పార్క్ అధికారులకు, పోలీస్ అధికారులకు పలు సూచనలు తెలియజేసిన ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్.ఈ కార్యక్రమం లో పోలీస్ అధికారులు,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖలో ప్రేమ జంట ఆత్మహత్య

**విశాఖపట్నం, (ప్రభాత సూర్యుడు):** విశాఖపట్నం షీలానగర్ లో ప్రేమజంట ఆత్మహత్య స్థానికంగా కలకలం రేపింది. షీలానగర్ పిఎస్ వెంకటేశ్వర కాలనీలో వినాయక్ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్‌లో తెల్లవారుజామున అపార్ట్మెంట్ పై నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.మృతులను అమలాపురంకు చెందిన పిల్లి దుర్గారావు, సాయి సుస్మితగా పోలీసులు గుర్తించారు. మృతుడు దుర్గారావు హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో క్యాటరింగ్ నడుపుతుండగా, మృతురాలు సాయి సుష్మిత ఒక ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆరు నెలలుగా అపార్ట్మెంట్లో ఉంటున్న పిల్లి దుర్గారావు వద్దకి మృతురాలు అప్పుడప్పుడు అపార్ట్మెంట్కు వచ్చి మృతురాలు సాయి సుస్మిత వచ్చి వెళుతుండేదని చెబుతున్నారు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో గాజు గ్లాస్, టీవీ రిమోట్ పగిలిపోవడం పోలీసులు గుర్తించారు.



## ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలను మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గురవయ్య మాట్లాడుతూ మండలంలోని వికలాంగ విద్యార్థులందరూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారికి వచ్చే నెల నెల బత్యం ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి బుధవారం భవిత సెంటర్ చిలుకూరులో ఫిజియోథెరపీ డాక్టర్ అందుబాటులో ఉంటారని,ఆయన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ టీచర్ సుమలత, పద్మ, విద్యార్థులు ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు నమోదు




**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** మాజీ మంత్రి హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కూడా కేసు నమోదైంది. 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని మండిపడ్డారు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేపేద్దాం



బాల్య వివాహాలు పాతకాలం నాటి మాట. కానీ ఆ అనాచారం నేటికీ కొనసాగుతోంది. స్త్రీ శక్తి ఏమిటో ప్రపంచానికి తెలిసిన ఈ రోజుల్లోనూ బాల్య వివాహాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతున్నట్లు 'ది లాన్సెట్ జర్నల్' వెల్లడించింది. అంతేకాదు కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చదువులు చతికిల బడ్డాయి. పేదరికం పెరిగిపోయింది. ఫలితంగా వచ్చే దశాబ్ద కాలంలో కోటి మంది బాలికలువివాహ చట్రంలో ఇరుక్కుపోనున్నారు. ఏటా 1.2 కోట్ల మంది బాల్యంలోనే వివాహ వ్యవస్థలోకి నెట్టబడతా రని లాన్సెట్ చెబుతోంది. బాల్య వివాహాలు ఆడపిల్లల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పు. లేత శరీరా లు.. తెలియని వయసు, పరిపక్వతలేని మనసు, అమ్మపై ఆధారపడే వయస్సులో అమ్మగా మార డం ఆ చిన్నారి ఎదుగుదలకు ఆటంకం.÷ాల్య వివాహాలు నిరోధించడానికి రాజారామ్ మోహన్‌రారు, కందుకూరి వీరేశలింగం వంటివారు కృషి చేసినా ఈ మూఢాచారం నేటికీ కొనసాగటం దురదృష్ట కరం. తల్లి గర్భం నుంచే సమాజంతో నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి బాలికలది. సాధ్య మైనంత త్వరగా ఆడపిల్లకు పెళ్లి చేసి వదిలించుకోవాలన్న పురుషాధిక్య భావజాలం ఆడపిల్ల అందమైన కలలను, భవితను, జీవితాన్ని చిదిమేస్తోంది. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన బాలి కలు చిన్న వయసులో పెళ్లి వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. శారీరక, మాన సిక పరిపక్వత లేని వయసులో గర్భం ధరించడం వల్ల మాతాశిశు మరణాలు పెరుగుతు న్నాయి. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల చిన్నతనం నుంచే వారి హక్కులు ఉ ల్లంఘించబడుతూ, ఆర్థిక పరాధీనతను పెంచుతున్నాయి. 'బాల్య వివాహాలు బానిసత్వం యొక్క ఒక రూపం. దానిని రద్దు చేయాలి' అన్నారు నెల్సన్ మండేలా. బాల్య వివాహాలు సామాజిక దురాచారం. వీటిని అరికట్టడం వలన మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా వుందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిగా 1929లో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత క్రమంగా పరిస్థితి మరింత మెరుగుపడుతూ వచ్చింది. అయినా నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి. 8 ఏళ్లలోపు బాలికలు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేస్తే, తల్లిదం డ్రులతోపాటు వివాహం చేసిన వారికి కూడా రెండేళ్లపాటు జైలుశిక్ష విధిస్తారని చట్టం చెబుతోంది. బాలలకు చట్టంలో సమానత్వం వుందని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం రావాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపున దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు నిరాఘాటంగా జరుగుతున్నాయి. మనిషి కథ ఆరంభమైన చోటనే అంతం కాకూడదు, అది సంతాపంగా మారకూడదు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది, వారి జీవితాన్ని వెలుగు దివ్వెగా మార్చేది, పురుషాధిక్యతను ప్రశ్నించేది చదువు మాత్రమే. ఇది నిషిద్ధ స్వప్నం కాదు. ఈ పురుషాధిపత్య సంకెళ్లను ఛేదించి, తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే సాధికారయత్నం. ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేసి ఆడబిడ్డను బతకనివ్వాలి.. ఎదగనివ్వాలి..చదవనివ్వాలి? ఎగరనివ్వాలి.

# 'సీజ్ ద షిప్' తరువాత ఏం జరిగింది? సీజ్ అయిందా?






ఏపీ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ సినిమాటిక్ డైలాగ్ 'సీజ్ ద షిప్..' తెలుగు నాట ఐదు రోజులుగా హల్ చల్ చేస్తోంది. కాకినాడ యాంకరేజీ పోర్టులో బియ్యం తరలింపు కోసం సిద్ధమైన పనామా దేశానికి చెందిన 'స్టెల్లా ఎల్' అనే షిప్‌ను సీజ్ చేయాలంటూ ఉపముఖ్యమంత్రి ఆదేశించిన తర్వాత 'సీజ్ ద షిప్' అనే మాట ట్రెండ్ అయ్యింది. అయితే, స్వయంగా ఉప ముఖ్యమంత్రి ఆదేశించి నప్పటికీ అధికారులు ఆ షిప్‌ను ఇంకా ఎందుకు సీజ్ చేయలేదు? మరో దేశానికి చెందిన షిప్‌ను సీజ్ చేసే అధికారం రాష్ట్ర అధికారులకు ఉంటుందా? తనకు సంబంధం లేని శాఖలో పవన్ జోక్యం చేసుకున్నారా? అసలు అలా పోర్టులోని నౌకలో తనిఖీలు చేసే అధికారం మంత్రులకు, ప్రజాప్రతి నిధులకు ఉంటుందా? కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారు . ఇక్కడి నుంచి ఇంత భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? తీరప్రాంతంలో అక్రమ రవాణాను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైతే దేశ భద్రతకే ముప్పుగా మారుతుంది. భవిష్యత్తులో పేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు అక్రమంగా దేశంలోకి రావని గ్యారంటీ ఏంటి?' అని అధికారులను ప్రశ్నించిన పవన్ కల్యాణ్.. 'సీజ్ ద షిప్' అని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఆ షిప్‌ను సీజ్ చేయడంతో పాటు, ఈ బియ్యం రవాణా వెనుక ఎవరున్నారో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే పవన్ అదేశించినట్టుగా ఏమీ జరగలేదు. ఆయన పర్యటన తర్వాత అధికారులు మిన్నకుండిపోయారు. ఏం చేయాలో తెలియకో లేక నిబంధనల వల్లనో, ఇంకేదైనా కారణం వల్లనో ఏమో గానీ.. షిప్‌ను సీజ్ చేయడం మాట అటుంచి ఆ రేషన్ బియ్యాన్ని కూడా సీజ్ చేయలేకపోయారు. 'ఇంకా షిప్ సీజ్ చేయలేదు. అందులో పీడీఎస్ బియ్యం పట్టుబడటంతో పౌర సరఫరాల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కస్టమ్స్ అధికారులతో మాట్లాడుతున్నారు. ఇది కస్టమ్స్ నోట్గి÷డ్ పోర్టు కాబట్టి వాళ్లే నిర్ణయం తీసుకోవాలి' అని కాకినాడ పోర్టు అధికారి ఒకరు తెలిపారు. ఐతే, తీరంలోకి వచ్చి.. ఇక్కడి నిబంధనలను అతిక్రమించిన ఏ షిప్‌నైనా సీజ్ చేసే అధికారం మన పోర్టు అధికారులకు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అధీనంలోని పోర్టులకు, స్టేట్ పోర్టులకు పోర్టు ఆఫీసర్ బాధ్యులుగా ఉంటారు. కేంద్రం పరిధిలోని పోర్టులకు హార్బర్ మాస్టర్ ఉంటారు. ఇండియన్ పోర్ట్స్1908 యాక్ట్ ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతులు చేసే ఏ దేశపు షిప్‌నైనా సీజ్ చేసే అధికారం వారికి ఉంటుంది. ఎందుకంటే ఆ షిప్ మన తీరంలో ఉంది కాబట్టి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాహనం తెలంగాణలో ప్రమాదానికి కారణమైతే ఎలా కేసు నమోదు చేస్తారో ఇది కూడా అంతే. వాస్తవానికి స్టేట్ పరిధిలోని పోర్టు కాబట్టి మంత్రిగా పవన్ కల్యాణ్ పరిశీలించాలని భావిస్తే ముందస్తు సమాచా రం ఇవ్వాలి. ప్రయర్ నోటీసు ఇవ్వకుండా అలా తనిఖీలు చేసే అధికారం ఎవరికీ లేదు. ఏ పోర్టులోకి అయినా సరే నోటీసు ఇవ్వకుండా వెళ్లడానికి వీల్లేదు. రైట్ ఆఫ్ అడ్మిషన్ అనేది సాధారణంగా ఇస్తారు. కానీ ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఐతే, బియ్యం స్మగ్లింగ్ కిందకు రాదు, ఎగుమతుల కిందకే వస్తుంది. ప్రభుత్వ అనుమతి వచ్చే వరకూ ఆ షిప్‌ను పంపొద్దు. కాగా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం మధ్యాహ్నం భేటీ అయిన తర్వాత ప్రభుత్వం నుంచి ఓ ప్రకటన వెలువడింది. కాకినాడ పోర్టుకు ఐపీఎస్ కేడర్ స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నియమించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సోమవారం జరిగిన సమీక్షలో నిర్ణయించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. పోర్టులో ఉన్న ఆ షిప్‌ను ప్రభుత్వం అనుమతి వచ్చే వరకు పంపొద్దని ఆదేశాలిచ్చినట్టు స్పష్టం చేసింది. 2019లో వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కాకినాడ పోర్టులో 41.12 శాతం వాటాను అరబిందో సంస్థకు కట్టబెట్టారని, ఆ తర్వాతే అక్కడి నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతులు భారీగా పెరిగాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలోని చివరి మూడేళ్లలో కాకినాడ పోర్టు నుంచి రూ.48,537 కోట్ల విలువైన బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేశారని మంత్రి చెప్పారు. 'కాకినాడ పోర్టు మీదే కూటమి ప్రభుత్వం ఎందుకు దృష్టిపెట్టిందని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. దానికి కారణం ఉంది. గత ఐదేళ్లలో కాకినాడ పోర్టులోకి ఎవరినీ అనుమతించలేదు. అక్కడ ఏం జరుగుతోందో బాహ్య ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. పకడ్బందీగా వ్యూహం రచించి ఆఫ్రికన్ దేశాలకు బియ్యం ఎగుమతులు చేసి కోట్లు కూడబెట్టారు. మన రాష్ట్రంలో గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో గంగవరం పోర్టు నుంచి 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుంచి 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుంచి 38,02,000 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరిగితే... ఒక్క కాకినాడ పోర్టు నుంచే 1,31,18,346 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరిగాయి. ఒక్క కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి అయిన బియ్యం విలువే రూ. 48,537 కోట్లు అంటే బియ్యం మాఫియా ఏ విధంగా రెచ్చిపోయిందో అర్థం చేసుకోవచ్చు. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ కంపెనీ నుంచి అరబిందో రియాల్టీకి 41.12 శాతం వాటా బదిలీ అయ్యింది. అరబిందో కంపెనీ పోర్టు టేకోవర్ చేసిన తరువాత ఊహించని తీరిలో 1,31,18,346 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశారంటే ఏ మేరకు దందా జరిగిందో ప్రజలు అర్థం చేసుకోవాలి' అని మనోహర్ అన్నారు.

# 80 శాతం పైగా జనరల్ కేటగిరీ ప్రొఫెసర్లే

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల అధ్యాపకులలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ - సమాచార హక్కు) ద్వారా వెల్లడైంది. రెండు ఐఐటిలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటిల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80-90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటి, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఐఐటి, ఐఐఎంల తోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లు ఇచ్చారు. వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్‌టిఐ తెలిపింది. ఇక ఉదరుపూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించినట్లైతే ఒక్క ఎస్‌టి కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టుగా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి. ఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ఢిల్లీ ఐఐటిల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80-90 శాతం మేర జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు. మొత్తంగా 13 ఐఐఎంల్లో 82.8 శాతం మంది అధ్యాపకులు జనరల్ కేటగిరీ వారు వుండగా, కేవలం 5 శాతం ఎస్‌సి, ఒక శాతం ఎస్‌టి, 9.6 శాతం మంది ఓబిసి, ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు (ఇబిసి), వికలాంగుల కోటాలకు చెందినవారు అధ్యాపకులుగా ఉన్నారు. 1 ఐఐటిలో 80 శాతం జనరల్ కేటగిరీ, 6 శాతం ఎస్‌సి, 1.6 శాతం ఎస్‌టి, 11.2 శాతం ఓబిసి, ఇబిసి, వికాలాంగుల కోటాలకు చెందిన అధ్యాపకులు ఉన్నారు. మొత్తంగా ఐఐటిల్లో గానీ, ఐఐఎంల్లో గానీ ఇంచుమించుగా ఇదే గణాంకాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎంలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొందని కూడా చెప్పలేమని ఆర్‌టిఐ పేర్కొంది. పాట్నా ఐఐటి అధ్యాపకుల్లో 38 శాతం ఓబిసి, ఎస్సీలు 22 శాతం, ఎస్‌టిలు 13 శాతం, జనరల్ కేటగిరీ 12 శాతం మందే ఉన్నారు. భిలారు, ఇండోర్ ఐఐటిల్లో 50 శాతం మంది జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. జమ్మూలో 51 శాతం జనరల్ కేటగిరీ, 19 శాతం ఎస్‌సి, 5 శాతం ఎస్‌టి, 23 శాతం ఓబిసి, 2 శాతం ఇతర కేటగిరీలకు చెందిన వారు అధ్యాపకులుగా ఉన్నారు. ఏడు ఐఐఎంల్లో 256 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్‌టిఐ డేటా తెలిపింది. ఈ పోస్టుల్లో ఓబిసి కేటగిరీకి చెందినవి 88, 54 ఎస్‌సి, 30 ఎస్‌టి కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఐఐటిల్లో 1,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 451 ఓబిసి, 234 ఎస్‌సి,, 129 ఎస్‌టి పోస్టులు ఉన్నాయని ఆర్‌టిఐ తెలిపింది.

# నేను ఆరోగ్యంగానే ఉన్నా

## ఏక్‌నాథ్ షిండే

**ముంబై, (ప్రభాత సూర్యుడు):** తాను ఆరోగ్యంగానే ఉన్నానని, కేవలం వైద్య పరీక్షల కోసమే ఇవాళ ఆస్పత్రికి వెళ్లానని మహారాష్ట్ర కేర్ టేకర్ సీఎం ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులవుతున్నా కొత్త సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతున్న వేళ ఆయన ఆస్పత్రిలో చేరడం పలు అనుమానాలకు తావిచ్చింది. సీఎం పదవిని బీజేపీకి వదులుకోవడం ఇష్టం లేకనే షిండే డ్రామాలు ఆడుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన ఆస్పత్రి నుంచి బయటకు రాగానే తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ ప్రకటన చేశారు. కేవలం వైద్య పరీక్షల కోసమే ఆస్పత్రిలో చేరానని చెప్పారు. కాగా మహారాష్ట్ర సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీకే ఈసారి సీఎం పదవి దక్కుతుందని, సీఎంగా ఫడ్నవీస్ పేరును బీజేపీ ఖాయం చేసిందని వార్తలు వినిపిస్తున్నా.. ఈ వార్తలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, సీఎం పదవిపై బీజేపీ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని ఇటీవల ఏక్‌నాథ్ షిండే ప్రకటించడంతో ఫడ్నవీస్‌కు సీఎం పదవి పక్కా అనేది తేలిపోయింది. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బుధవారం మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై సీఎంను ఎన్నుకోనుంది. ఈ సమావేశానికి గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బీజేపీ కేంద్ర పరిశీలకులుగా హాజరుకానున్నారు.

## తిరుపతిలో విరిగిపడ్డ కొండచరియలు

**తిరుపతి, (ప్రభాత సూర్యుడు):** తిరుమలలో కొండ చర్యలు విరిగిపడ్డాయి. మట్టి, బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. రెండో ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు దగ్గర ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అటు వైపు వెళ్లే ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ, ఫారెస్ట్ సిబ్బంది వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాపై ఫెంగల్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఫెంగల్ దెబ్బతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. భారీ వర్షాలకు పలు రోడ్డు దెబ్బతిన్నాయి. ఇప్పటికే చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరి, టమాటా, అరటి, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కల్లాల్లో వరి పంట తడిసి మొలకెత్తుతోన్న పరిస్థితి ఏర్పడింది. నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215